మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  ఎడిటర్ : నంద కిషోర్  సంపుటి : 08  సంచిక : 08  బుధవారం  04 - 06 - 2025  పేజీలు: 8  వెల: 4

## ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత ప్రాజెక్టుపై తెలంగాణ మంత్రి తీవ్ర అభ్యంతరం



2లో..

### ఉగ్రసంస్థలతో లింకులు ముగ్గురు

## ప్రభుత్వ ఉద్యోగులపై వేటు



- జమ్ముకశ్మీర్‌లో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను తొలగించిన ప్రభుత్వం
- ఉగ్రసంస్థలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై చర్యలు

మన గళం, న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులతో సంబంధాలున్న ప్రభుత్వ ఉద్యోగులపై యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు తేలిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు నుంచి తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

2లో..



## నష్టం కాదు..
## ఫలితం చూడాలి

మన గళం, పూణే : ఆపరేషన్ సిందూర్‌లో జరిగిన నష్టం కంటే.. ఎంత మేరకు లక్ష్యాన్ని సాధించామనేదే ముఖ్యమని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. మంగళవారం పూణేలోని సావిత్రి బాయ్ పులే యూనివర్సిటీలో భవిష్యత్తులో యుద్ధాలు, యుద్ధం అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేశారు. భారత్‌పై మరిన్ని ఉగ్రదాడులు జరగకుండా ఉండే క్రమంలో పాకిస్థాన్‌లోకి చొచ్చుకుని వెళ్లి మరీ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఆయన అత్యంత క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ఈ చర్యను అధునిక ప్రపంచం ఏ మాత్రం ఒప్పుకోదని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌పై భారత్‌లోని

2లో..

### ఈ నెల 5న స్పెషల్ ప్రణాళికలతో

## అయోధ్యకు రావద్దు



మన గళం డెస్క్ : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆలయంలో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. 2024 జనవరి 22న గర్భ గుడిలో బాల రామయ్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఇప్పుడు రెండవ ప్రాణ ప్రతిష్ఠ వేడుక ఈ రోజు నుంచి ప్రారంభమైంది, ఇది జూన్ 5న రామ్ దర్బార్ లోని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠతో పూర్తవుతుంది. గంగా దసరా కూడా జూన్ 5న జరుపుకోనున్నారు. అయితే రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ ఆలయంలో జరుగుతుంది. ఈ సమయంలో భక్తులు రామ దర్బార్ ను దర్శనం చేసుకోలేరు. రామ దర్బార్ ను చూసేందుకు ప్రణాళిక వేసుకుంటున్న భక్తులు ఈ నెల 5న భక్తులు అయోధ్యకు రావద్దని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర

2లో..

- డీఎస్సీ పరీక్ష నిలిపివేతకు సహేతుకమైన కారణాలు సమర్పించనందున స్టే విధించలేం
- మెగా డీఎస్సీ నిలిపివేతకు హైకోర్టు నో..
- అనుబంధ పిటిషన్లు కొట్టివేత!




## పూర్తి హక్కు ప్రభుత్వానిదే

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌పై హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లను ధర్మాసనం కొట్టివేసింది. జూన్ 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న డీఎస్సీ రాత పరీక్షలను నిలిపి వేయాలని స్టే కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు సోమవారం విచారించింది. డీఎస్సీ పరీక్ష నిలిపివేతకు సహేతుకమైన కారణాలు సమర్పించనందున స్టే విధించలేమని కోర్టు తేల్చి చెప్పింది. పైగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించే ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ నేపథ్యంలో స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఇప్పటికే హాల్ టికెట్లు కూడా జారీ చేయడం జరిగిందని, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రభుత్వం తరపు న్యాయవాది చెప్పడంతో.. ఈ దశలో విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పరీక్షలను నిలిపివేయడం సరికాదని చెప్పింది. ఉద్యోగాల భర్తీ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకునే హక్కు పూర్తిగా ప్రభుత్వానికే ఉంటుందని స్పష్టం చేసింది. హౌజ్‌మోషన్లో దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2011లో ప్రభుత్వం జారీచేసిన జీవో 51 ప్రకారం ఏడాదికి రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే నిబంధనలకు భిన్నంగా ఒక్కసారి మాత్రమే టెట్ పరీక్ష నిర్వహించినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. రెండోసారి టెట్ పరీక్ష నిర్వహించకుండానే డీఎస్సీ 2025 నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమంటూ చిత్తూరు జిల్లాకు చెందిన పిప్రభాకర్‌తోపాటు మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. అలాగూ 2024 ఫిబ్రవరి 12న జారీచేసిన ఏపీ డీఎస్సీ 2024కి తాము వయసు పరంగా అర్హత సాధించామని, కూటమి సర్కార్ దానిని రద్దు చేయడంతో అధిక వయసు కారణంగా ఈ ఏడాది ఏప్రిల్ 20న జారీచేసిన నోటిఫికేషన్‌కు అనర్హులమైనట్లు మరికొందరు

2లో..



## చంద్రబాబును కలిసిన అక్కినేని నాగార్జున

మన గళం, అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సినీ నటుడు అక్కినేని నాగార్జున ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను నాగార్జున కలిశారు. తన కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆయన వ్యక్తిగతంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను చంద్రబాబుకు నాగార్జున అందజేశారు. ప్రస్తుతం అక్కినేని కుటుంబంలో పెళ్లి సందడి నెలకొంది. అఖిల్ వివాహం ఈ నెల 6వ తేదీన జరగనున్న నేపథ్యంలో, నాగార్జున ప్రముఖులను స్వయంగా కలిసి వివాహ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన ఈరోజు ఉండవల్లికి విచ్చేసి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఇరువురు కాసేపు వివిధ అంశాలపై మాట్లాడుకున్నట్లు సమాచారం.

### పోలీసుల తీరుపై

## జగన్ సంచలన ఆరోపణలు

- యువకులపై పోలీసుల అమానుషంగా దాడి చేశారు
- ఏప్రిల్ 24న వివాదం, తర్వాత రోజుల తరబడి చిత్రహింసలు పెట్టారని ఆరోపణ

మన గళం, తెనాలి : తెనాలిలో ఇటీవల జరిగిన ఓ ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ముగ్గురు యువకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, వారిపై అక్రమ కేసులు బనాయించి, చిత్రహింసలకు గురిచేశారని



2లో..

## వైఎస్ జగన్ పర్యటనపై నిరసనలు

- జగన్‌కు మాత్రం నిరసనల రూపంలో ఊహించని షాక్



మన గళం, గుంటూరు: గుంటూరు జిల్లా తెనాలిలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇవాళ (మంగళవారం) పర్యటిస్తు న్నారు. జగన్ పర్యటన కోసం స్థానిక కేడర్ అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే జగన్‌కు మాత్రం నిరసనల రూపంలో ఊహించని షాక్ తగిలింది. జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత, ప్రజాసంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. తెనాలి మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేపట్టారు. వైసీపీ హయాంలో హత్యకు గురైన

2లో..

## అరాచకాలు చేసిన వారికి జగన్ మద్దతివ్వడం దారుణం



మన గళం, అమరావతి : గంజాయి బ్యాచ్‌కు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సానుభూతి పలకడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. అరాచకాలు చేసినవారికి జగన్ మద్దతివ్వడం దారుణమని చెప్పారు. డాక్టర్ సుధాకర్‌ను జగన్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. తనకు ఓటేయని ప్రజలపై వైసీపీ వెన్నుపోటు దినోత్సవం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇవాళ( మంగళవారం) అమరావతిలో రఘురామ పర్యటించారు. హెల్త్ కార్డ్ కోసం

2లో..

# ఉగ్రసంస్థలతో లింకులు ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై వేటు

**మొదటిపేజీ తరువాయి** జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. తొలగించిన వారిలో పోలీస్ కానిస్టేబుల్ మాలిక్ ఇష్ఫాక్ నసీర్, పాఠశాల ఉపాధ్యాయుడు అజాజ్ అహ్మద్, ప్రభుత్వ వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వసీం అహ్మద్ ఖాన్ ఉన్నారు. ఈ ముగ్గురూ ఉగ్రవాద సంస్థలకు సరుకులు చేరవేయడం, ఆయుధాల అక్రమ రవాణాకు పాల్పడటం, భద్రతా దళాలకు వ్యతిరేకంగా ఉగ్రవాదుల కార్యకలాపాలకు సహకరించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉగ్రవాదుల సానుభూతిపరులను గుర్తించి, వారిని ఏరివేసే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు లెఫ్టినెంట్ గవర్నర్ కార్యవర్గం సుమారు 75 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు గుర్తించి వారిని విధుల నుంచి తొలగించింది. క్షేత్రస్థాయిలో ఉగ్రవాదులకు సహకరిస్తున్న వారిని గుర్తించేందుకు నిరంతర నిఘా కొనసాగుతోంది. 2007లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన మాలిక్ ఇష్ఫాక్ నసీర్, పాకిస్థాన్‌లో శిక్షణ పొందిన లష్కరే ఉగ్రవాది అయిన తన సోదరుడు మాలిక్ ఆసిఫ్‌కు చేదోడువాదోడుగా ఉన్నట్లు తేలింది. 2018లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ఆసిఫ్ మృతి చెందాడు. అయినప్పటికీ ఇష్ఫాక్ తన ఉగ్ర కార్యకలాపాలను కొనసాగించాడు. ఉగ్రవాదులకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను చేరవేయాల్సిన ప్రదేశాలను గుర్తించి, వాటి జీపీఎస్ కోఆర్డినేట్లను పాకిస్థాన్‌లోని ఉగ్ర హ్యాండ్లర్లకు పంపేవాడని ఆరోపణలున్నాయి. అక్కడకు చేరిన ఆయుధాలను గుర్తించి, వాటిని జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాదులకు చేరవేసేవాడని 2021లో పోలీసులు గుర్తించారు.

# నష్టం కాదు.. ఫలితం చూడాలి

**మొదటిపేజీ తరువాయి** ప్రజల్లో మరింత అసహనం వ్యక్తమయ్యే అవకాశాలున్నాయన్నారు. ఈ పహల్గాం దాడిలో ఉగ్రవాదులు మతం అడిగి మరి.. వారి కుటుంబ సభ్యుల ముందే కాల్పులు జరిపారని గుర్తు చేశారు. దేశంలో జరిగిన ఉగ్రవాదుల చర్యల కారణంగా.. భారత్‌లో దాదాపు 20 వేల మందికిపైగా మరణించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఇటీవల సింగపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఈ దాడిలో భారత్ ఆరు యుద్ధ విమానాలను కోల్పోయిందంటూ చేస్తున్న ప్రచారాన్ని ఖండించారు. యుద్ధ విమానాలు కోల్పోయిన మాట వాస్తవం కానీ ఎన్ని అనే సంఖ్యను మ్మాత్రం ఆయన స్పష్టం చేయలేదన్న సంగతి తెలిసిందే. మరో వైపు ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌ను దెబ్బ తీశామంటూ కేంద్రం స్పష్టమైన ప్రకటన చేసింది. కానీ ఈ ఆపరేషన్‌లో యుద్ధ విమానాలను కోల్పోయిన విషయాన్ని ఎందుకు చెప్పలేదంటూ కేంద్రాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు.. భారత్ యుద్ధ విమానాలను కోల్పోయిన సంగతి సింగపూర్ వెళ్లిన అనిల్ చౌహాన్ చెప్పడం ఎంత వరకు సబబు అని కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నిలదీసింది.

# ఈ నెల 5న స్పెషల్ ప్రణాళికలతో అయోధ్యకు రావద్దు

**మొదటిపేజీ తరువాయి** ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే వాతావరణం దృష్ట్యా రామ దర్బార్ ప్రతిష్ఠ సమయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఈ కార్యక్రమం కోసం ఎవరినీ ఆహ్వానించలేదని చెప్పారు. ఆయన సోషల్ మీడియా ద్వారా భక్తులను కోరారు.

– ముఖ్య అతిథిగా సీఎం యోగి ఆదిత్యనాథ్ హాజరు

అయితే.. భక్తులు యధావిధిగా బాల రామయ్యను దర్శనం చేసుకోవచ్చని ఆయన అన్నారు. అంతేకాని ప్రత్యేక ప్రణాళికతో మాత్రం భక్తులు అయోధ్యకు రావద్దని అభ్యర్థించారు. రామమందిరం మొదటి అంతస్తులో రామ దర్బార్‌తో పాటు.. ఆలయ ప్రాంగణంలో మిగిలిన 6 దేవాలయాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఇవి గణేశుడు, శివుడు, భగవతి, హనుమంతుడు, సూర్యుడు, అన్నపూర్ణ దేవి సహా శ్రీ విష్ణువు అవతారంలోని మిగిలిన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వీటికి సంబంధించిన ఆచారాలు ఈరోజు (జూన్ 3వ తేదీ మంగళవారం) నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు.

# వైఎస్ జగన్ పర్యటనపై నిరసనలు

**మొదటిపేజీ తరువాయి** నూతక్కి కిరణ్‌ను జగన్ పరామర్శించలేదని... రౌడీషీటర్లకు మద్దతుగా నిలవడం దారుణమంటూ దళిత, ప్రజాసంఘాలు నినాదాలు చేశాయి. తెనాలిలో జగన్‌కు నిరసనల సెగ తగలడంతో వైసీపీ నేతలు డైలామాలో పడ్డారు. అలాగే ఐతానగర్ సెంటర్‌లో జగన్‌ను ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. జగన్ గో బ్యాక్ అంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారు. తెనాలిలో ఎర్ర బడి వద్ద జగన్ కాన్వాయ్‌ను ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు అడ్డుకున్నారు. దళితులపై ఇప్పుడు ప్రేమ పుట్టుకొచ్చిందా అంటూ నిరసన వ్యక్తం చేశారు. హత్యలు చేసిన వారిని, రౌడీషీట్లు ఉన్నవారిని, పోలీసులను కొట్టిన వారిని జగన్మోహన్‌రెడ్డి ఎలా పరామర్శిస్తారని ఎమ్మార్పీఎస్ నేతలు నిలదీశారు. నల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. అయితే రోడ్డు మీదకు వస్తున్న దళిత సంఘాలను పోలీసులు అడ్డుకున్నారు. తెనాలిలో భారీగా పోలీసులు మోహరించారు. దీంతో తెనాలిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది.

# అరాచకాలు చేసిన వారికి జగన్ మద్దతివ్వడం దారుణం

**మొదటిపేజీ తరువాయి** కొంతమంది నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చి మరి తెల్లరేషన్ కార్డు తీసుకుంటున్నారని.. అలా చేయొద్దని రఘురామకృష్ణంరాజు కోరారు. హెల్త్ కార్డ్ ఉన్న ప్రతి పౌరుడికి రూ. 25 లక్షలు కవరయ్యేలా చూడాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందని రఘురామకృష్ణంరాజు చెప్పారు. ముందు తమ కమిటీ రిపోర్ట్‌ని అసెంబ్లీ స్పీకర్‌కు ఇస్తామని వెల్లడించారు. అవసరం లేకుండా కొంతమంది రేషన్ తీసుకోవడం వల్లే బియ్యం స్మగ్లింగ్ జరుగుతుందని అన్నారు. ఇప్పుడు కోటి 40 లక్షలు మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని వివరించారు. ఏపీలో మొత్తం కోటి 70 లక్షల కుటుంబాల్లో.. కోటి 40 లక్షలు బీపీఎల్ కిందే ఉన్నారనే విషయాన్ని నమ్మడం కష్టమని అన్నారు. రేషన్ అవసరం లేని వారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి



హెల్త్‌కార్డ్‌లో భాగంగా రూ. 25 లక్షలు కవరయ్యేలా చేస్తామని వివరించారు రఘురామకృష్ణంరాజు. ఏపీ ప్రభుత్వం రేషన్‌కు రూ.5, 100 కోట్లు ఇస్తోందని.. ఇందులో రూ. 2000 కోట్లు రేషన్‌లో మిగిలితే ఆ మొత్తం విద్యాశాఖకు ఖర్చు పెడితే నాణ్యమైన విద్యా లభిస్తుందని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించారు. హెల్త్ కార్డ్, రేషన్ కార్డు, పెన్షన్ కార్డులను వేర్వేరుగా ఇస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని తమ కమిటీ ఆలోచించిందని చెప్పారు. ఈ విషయాన్ని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి అందించాలని నిర్ణయించామని తెలిపారు. 15 రోజులకు ఒకసారి తమ కమిటీ సమావేశం అవ్వాలని నిర్ణయించామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో పిటీషన్ కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదని అన్నారు. రేషన్ అవసరం లేకపోతే ఆ మేరకు నగదు బదిలీపై చర్చిస్తున్నామని తెలిపారు. కోటి 46 లక్షల రేషన్ కార్డులకు నగదు ఇస్తే ధాన్యం ఎవరు కొంటారని ప్రశ్నించారు. బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తే ధాన్యం కొనరా అని అడిగారు. రేషన్ షాప్‌లో రేషన్ మాత్రమే కాకుండా అన్ని ప్రొవిజన్‌లు ఉండేలా చూసే ఆలోచన కూడా ఉందని అన్నారు. ఇప్పుడు అవసరం ఉన్న వారికి రేషన్ ఇంటి డెలివరీ అవుతుందని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

# పూర్తి హక్కు ప్రభుత్వానిదే

**మొదటిపేజీ తరువాయి** పిటిషన్లు దాఖలు చేశారు. డీఎస్సీ 2024కు అర్హులైన వారంతా ప్రస్తుత డీఎస్సీకి అర్హులుగా ప్రకటించాలని వారు కోరారు. సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం టెన్త్‌లో ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, సెకండ్ లాంగ్వేజ్ తెలుగు చదివిన వారికి డీఎస్సీ 2025లో అవకాశం ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ ఎమ్మిగనూరుకు చెందిన వెలికంటి సాంబశివ మరో వ్యాజ్యం వేశారు. అలాగే బీఈడీ చివరి సంవత్సరం చదువుతున్న వారిని డీఎస్సీ నుంచి మినహాయించడంపై, మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు 90 రోజుల గడువు ఇవ్వకపోవడం వంటి అంశాలపై పిటిషన్లు దాఖలైనాయి. వీటికి పాఠశాల విద్యాశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిస్తూ.. వయో పరిమితిని పెంచాలని కోరుతున్న వారికి 2024 డీఎస్సీ నాటికే అర్హత లేదన్నారు. నిర్దిష్ట పోస్టులకు తప్ప.. మిగిలిన పోస్టులకు సీబీఎస్ఈలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఇంగ్లిష్ చదివినవారు అర్హులేనన్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామని, పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశామని.. ఈ దశలో పరీక్షలను వాయిదా వేయడం సరికాదని, ఆ పిటిషన్లను కొట్టేయాలని కోర్టును కోరారు.



ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి అనుబంధ పిటిషన్లను కొట్టేశారు.

# పోలీసుల తీరుపై జగన్ సంచలన ఆరోపణలు

**మొదటిపేజీ తరువాయి** ఆయన మండిపడ్డారు. ఇవాళ తెనాలిలో యువకుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి పలు సంచలన ఆరోపణలను మీడియా ముందుంచారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వ్యవహరించారంటూ ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ వెల్లడించిన వివరాల ప్రకారం, తెనాలికి చెందిన రాకేష్ (జొమాటో ఉద్యోగి, హైదరాబాద్‌లో పనిచేస్తాడు), మంగళగిరికి చెందిన షేబ్రోల్ జాన్ విక్టర్ (జూనియర్ అడ్వకేట్), కరీముల్లా (మెకానిక్) అనే ముగ్గురు యువకులు ఈ ఘటనలో బాధితులుగా ఉన్నారు. వీరు దళిత, మైనారిటీ వర్గాలకు చెందినవారని, అణగారిన వర్గాల యువకులని జగన్ పేర్కొన్నారు. ఏప్రిల్ 24న తెనాలిలోని ఐతానగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఓ కానిస్టేబుల్ సివిల్ డ్రెస్సులో ఎవరితోనో గొడవపడుతుండగా, ఈ యువకులు జోక్యం చేసుకుని, "మా ఏరియాకు వచ్చి ఎందుకు గొడవ చేస్తున్నారు?" అని ప్రశ్నించారని జగన్ తెలిపారు.



ఇదే వారు చేసిన తప్పయిందని ఆయన అన్నారు. ఆ కానిస్టేబుల్ జాన్ విక్టర్ బైక్ తాళాలు, ఫోన్ లాక్కున్నాడని, వారు వాటిని తిరిగి తీసుకున్న తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారని వివరించారు. అయితే, మరుసటి రోజు ఏప్రిల్ 25న, సదరు కానిస్టేబుల్ మరికొందరు పోలీసులతో కలిసి మంగళగిరి వెళ్లి జాన్ విక్టర్, కరీముల్లాలను కొట్టుకుంటూ తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని జగన్ ఆరోపించారు. ఆ రోజు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టారని తెలిపారు. ఏప్రిల్ 26న ఉదయం, స్టేషన్ సమీపంలోని ఐతానగర్ రోడ్డుపైకి తీసుకెళ్లి మళ్లీ విచక్షణారహితంగా కొట్టారని, వారి పరువు ప్రతిష్టలతో ఆడుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో తెనాలి టూ టౌన్ సీఐతో పాటు పక్క పోలీస్ స్టేషన్ సీఐ కూడా పాల్గొన్నారని జగన్ ఆరోపించారు. కాళ్లపై లాఠీలతో కొట్టడం వల్ల తీవ్రమైన గాయాలయ్యాయని, బొబ్బలు కట్టిన దృశ్యాలను ఆయన ప్రస్తావించారు. ఏప్రిల్ 27న, అంటే మూడో రోజు, యువకులను మరో రోడ్డు సెంటర్ అయిన లింగారావు సెంటర్‌కు తీసుకెళ్లి పట్టపగలు మళ్లీ రెండోసారి దారుణంగా కొట్టారని జగన్ వివరించారు. మూడు రోజులుగా పోలీసుల అదుపులోనే ఉన్న విక్టర్ జేబులో పోలీసులే ఒక కత్తి పెట్టి, ఇద్దరు వీఆర్‌ఓలను పిలిపించి, అతని వద్ద మారణాయుధం దొరికినట్లు పంచనామా రాసుకున్నారని సంచలన ఆరోపణ చేశారు. "మూడు రోజులు మీ దగ్గరే ఉన్న వ్యక్తి జేబులోకి కత్తి ఎలా వచ్చింది?" అని జగన్ పోలీసులను సూటిగా ప్రశ్నించారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత ప్రాజెక్టుపై తెలంగాణ మంత్రి తీవ్ర అభ్యంతరం

- ☐ ఏపీ బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ
- ☐ ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ
- ☐ సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటామనడంపై ఉత్తమ్ ఆగ్రహం
- ☐ కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు, జీఆర్ఎంబీకి లేఖలు రాసినట్లు వెల్లడి

మన గళం, హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం మరోమారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సముద్రంలోకి వృథాగా పోయే జలాలనే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ నేతలు పేర్కొనడం విస్మయం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరించేందుకు మేం అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఈ విషయంపై గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)కి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖలు రాశాం. అంతేకాకుండా, కేంద్ర మంత్రితో స్వయంగా మాట్లాడి,



ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాం. మాకున్న అభ్యంతరాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం" అని వివరించారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఇటువంటి ప్రాజెక్టుల విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై తగిన సమయంలో సముచిత రీతిలో స్పందిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మనగళం, కర్నూలు: యోగా తో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆరోగ్య, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు వెయ్యి మంది యోగభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21 వ తేది నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లాలో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. యోగాంధ్ర లో భాగంగా ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్ లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు..



– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలలో యోగా నిర్వహించాలనే థీమ్ లో భాగంగా ఈరోజు ఓర్వకల్లు రాక్ గార్డెన్ వద్ద యోగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామన్నారు. జూన్ 12 వ తేదీన కొండారెడ్డి బురుజు వద్ద, జూన్ 18 వ తేదీన మంత్రాలయం లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా 5 వేల మంది పారిశుధ్య కార్మికులతో జూన్ 17వ తేదీన కర్నూలు లో యోగా కార్యక్రమం నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యం చాలా బాగుంటుందన్నారు.. ప్రతి ఒకరు యోగా చేసి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనేది రాష్ట్ర ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21 వ తేదీన వైజాగ్ లో నిర్వహించనున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు పాల్గొంటున్నారన్నారు. ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. యోగా గురించి దేశంలో ఉన్న ప్రజలందరికీ తెలియజేయాలి, అందర్నీ యోగాలో భాగస్వామ్యులు చేయాలనే ఉద్దేశ్యంతోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, యోగా గురువులు ముని స్వామి, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో యోగా ప్రోటోకాల్ ప్రకారం దాదాపు గంట సేపు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయ భారతి, ఓర్వకల్లుఎంపిడిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సాగర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రసాద్, యోగాభ్యాసకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సుందరీకరణను పాడు చేస్తే కఠిన చర్యలు

– నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు



మనగళం, కర్నూలు :నగరంలోని కూడళ్లపై, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై, గోడలపై, పోస్టర్లు, బ్యానర్లు అతికించినా, రాతలు రాసినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు మరోసారి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ప్రధాన కూడళ్లలపై, డివైడర్ల మధ్యలోని స్తంభాలపై, గోడలపై బ్యానర్లు, ప్రైవేటు సంస్థల, సినిమా పోస్టర్లు అతికించడం, రాతలు రాయడం కారణంగా లక్షలాది ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణ పాడు అవుతుందని, కావున రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. దీనిని ఎవరైనా అతిక్రమించి నగర సుందరీకరణకు పాడు చేస్తే, వారిపై మున్సిపల్ కౌన్సిల్ సి.ఆర్.నెం: 78 ప్రకారం భారీ జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

– పాస్టర్ల గౌరవ వేతనం విడుదలకు కృషి చేసిన సీఎం చంద్రబాబుకు

– రుణపడి ఉంటాం : పాస్టర్లు – టీడీపీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు




మన గళం డోన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పాస్టర్లకు ఏడు నెలల గౌరవ వేతనం విడుదల చేసేందుకు కృషి చేశారని తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు క్రైస్తవులకు అండగా ఉంటుందని, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే క్రైస్తవులు బాగుపడతారన్నారు. తెలుగుదేశం పార్టీ క్రైస్తవుల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, గత సంవత్సరం జూలై నుండి నవంబర్ వరకు అందాల్సిన 7 నెలల గౌరవ వేతనాన్ని పాస్టర్ల అకౌంట్ లోకి రెండు రోజుల్లో జమ చేయనుందని తెలియజేశారు. రాష్ట్రం బాగుండాలని సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిలో భాగంగానే క్రైస్తవులు అభివృద్ధి చెందాలని ఆలోచనతో అన్ని విధాలుగా క్రైస్తవులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. క్రైస్తవులందరూ సీఎం చంద్రబాబు నాయుడు ఎల్లకాలం సంతోషంగా ఉండాలని ప్రార్థన చేయాలని తెలియజేశారు. ఈస్టర్ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే నూతన ఎన్రోల్మెంట్ నోటిఫికేషన్ వస్తుందని పాస్టర్ లందరూ చర్చికి సంబంధించిన డాక్యుమెంట్ లు రెడీ చేసుకోవాలని ఈటె స్వామిదాసు తెలియజేశారు. అనంతరం పాస్టర్లు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాస్టర్ల ఏడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేస్తున్నందుకు ఆయనకు రుణపడి ఉంటామని తెలియజేశారు. సీఎం చంద్రబాబు కోసం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా... కార్పొరేట్ అదాని పక్షమా

– సిపిఎం డిమాండ్



మనగళం, కర్నూలు :నగరంలోని 24వ వార్డు లక్ష్మీ నగర్ లో సిపిఎం పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు చార్జీలు తగ్గించాలంటూ ఇంటింటికి స్టిక్కర్లు వేసి ప్రజలను చైతన్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు శాఖ కార్యదర్శి ఏ లీలావతి నాయకత్వంవహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ నరసింహులు నగర నాయకులు సి శేషాద్రి కాలనీ ప్రజలను చైతన్య పరుస్తూ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రజల ఇళ్లకు పెడితే స్మార్ట్ మీటర్ భారం 12 వేల రూపాయలు భారం పడుతుంది జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు 28 వేల కోట్ల రూపాయలు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల పైన భారం వేసింది. ఆదాని కంపెనీతో స్మార్ట్ మీటర్ల ఒప్పందం చేసుకొని ఆదానితో జగన్మోహన్ రెడ్డి 1755 కోట్ల రూపాయలు లంచం తీసుకుని ప్రజల పైన కరెంటు భారాలు వేశాడు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలో కిరాక ముందు మేము అధికారం లో కొస్తే స్మార్ట్ మీటర్లను పెట్టము కరెంటు చార్జీలు పెంచము తగ్గిస్తాము . రైతులకు బిగించిన స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని చెప్పినటువంటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారం లోకొచ్చిన తర్వాతమాట తప్పింది వ్యాపార సముదాయ షాపులకు ప్రభుత్వ కార్యాలయాలకు రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించారు. తరువాత ప్రజల ఇళ్లకు కూడా బిగిస్తాము అంటున్నారు. అధికారం లోకొచ్చి సంవత్సర కాలం కాకముందే సర్ చార్జీలు యూజర్ చార్జీల పేరుతో 16 వేల కోట్ల రూపాయలు కరెంటు బారాలు ప్రజల పైన వేశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి అదాని ఎన్ని కోట్ల రూపాయలు లంచం ఇచ్చారో అందుకనే ప్రజల పైన కరెంటు భారాలు వేస్తూ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లు కనుక బిగిస్తే కరెంటు చార్జీలు ఒక్క రోజులోనే మూడు రకాల యూనిట్చార్జీలు చెల్లించ వలసి వస్తుంది.ముందుగానే కరెంటు కొరకు డబ్బులు డిపాజిట్ చేయవలసి ఉంటుంది. డిపాజిట్ చేసిన డబ్బులు అయిపోతే ఎప్పుడు కరెంటు పోతుందో తెలియని పరిస్థితి ఉంటుంది ప్రస్తుత కరెంటు విధానంబాగానే ఉంది నెల మొదటి వారం కరెంట్ బిల్లు ఇస్తే నెల ఆఖరి వరకు కరెంట్ బిల్లు చెల్లించే అవకాశం ఉంది నెల ఆఖరి వరకు బిల్లు చెల్లించకపోతే ఫైన్ తో చెల్లించే అవకాశం ఉంది కానీ స్మార్ట్ మీటరు మన ఇంటికి పెడితే ఆ అవకాశం ఉండదు. అందువలన స్మార్ట్ మీటర్ పెట్టే విధానాన్ని మానుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. ఒక్క రోజులోనే మూడు రకాల యూనిట్ చార్జీలువసూలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాత మీటర్లనే కొనసాగించి కరెంటు చార్జీలు తగ్గించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది ప్రజలందరూ స్మార్ట్ మీటరు స్టిక్కర్ వేసుకుని స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు చార్జీలు తగ్గించాలనినిరసనతెలియజేయాలని వారు కోరారు చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా లేదా కార్పొరేటు అదానిపక్షమా అనేది ప్రజలకుచెప్పాలని చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న ప్రజల పైన ప్రేమ ఉన్న వెంటనే స్మార్ట్ మీటర్ పెట్టే విధానాన్ని మానుకోవాలన్నారు. కరెంటు చార్జీలు తగ్గించాలని లేకపోతే ప్రజలను చైతన్యపరిచి సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ వార్డు నాయకులు సి చందు రాముడు కర్రెన్న జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కోడుమూరు మండలంలోని ఎరువులు మరియు పురుగు మందులు మరియు విత్తన డీలర్లతో సమావేశం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ఎరువులు మరియు పురుగు మందులు మరియు విత్తన డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలను సరఫరా చేయడం డీలర్ల బాధ్యతని డీలర్ల ఒదరూ సహకరించాలని వారు తెలియజేశారు విత్తనం ఎక్కడ కూడా కృతజ్ఞత సృష్టించరాదని రైతుకు ఎక్కువ రేటుకి అమ్మ రాదని బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని గట్టిగా చెప్పడం జరిగినది షాపులో ఉన్నటువంటి స్టాక్ ను స్టాక్ బోర్డులో కచ్చితంగా కనపరిచి ఉంచవలననే తెలుపడం అయినదినెలవారి రిపోర్టు మండల వ్యవసాయ అధికారికి ప్రతి డీలరు అందజేయాలని తెలపడం అయినది కాలం చెందిన పురుగు మందులు గాని విత్తనాన్ని గాని ఎరువులను కానీ అమ్మినట్లు ఎక్కడైనా గుర్తించిన ఎడల వారి లైసెన్సులు క్యాన్సల్ చేస్తూ క్రిమినల్ కేసులు పెట్టబడునని ఈ సందర్భంగా డీలర్లకు వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు డీలర్లు పాల్గొన్నారు



## రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదు

- వారికి ఇంటివద్దకే రేషన్ సరుకులు
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు :రేషన్ సరుకుల కోసం 65 సంవత్సరాలు పైబడిన వారు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు రావాల్సిన అవసరం లేదని, వారికి ఇంటి వద్దనే ఎఫ్.పి షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు మంగళవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఎఫ్ పి షాపుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ పై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారు, వికలాంగులు, మంచానికి పరిమితమైన కార్డుదారులు చౌక దుకాణాలకు రావాల్సిన అవసరం లేదు అని, వారికి ఇంటి వద్దనే ఎఫ్.పి షాపు డీలర్లు వచ్చి సరుకులు అందిస్తారు అని గ్రామాల్లో ప్రచారం చేయించాలని కలెక్టర్ తహసీల్దార్ లను ఆ దేశించారు. సెక్రటేరియట్ సిబ్బందితో చెప్పించాలని, అలాగే గ్రామాల్లో టాం టాం వేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఉదయం 8 గంటలకు ఎఫ్ పి షాపులను తప్పనిసరిగా ఓపెన్ చేయించాలని, తద్వారా పనులకు వెళ్ళే వారు ఉదయమే వచ్చి సరుకులు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. సరుకుల పంపిణీలో కర్నూలు డివిజన్ వెనుకబడి ఉందని, పురోగతి చూపించాలని కర్నూలు ఆర్డీవోను ఆదేశించారు అలాగే మండలాల వారీగా ఓర్వకల్, మద్దికెర, ఆదోని, కర్నూలు అర్బన్, సి బెళగల్, కృష్ణగిరి మండలాలు సరుకుల పంపిణీలో వెనుకబడి ఉన్నాయని, వేగవంతంగా పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. మద్దికెర మండలంలో సరుకుల పంపిణీ లో పూర్తిగా వెనుకబడి ఉండడంపై సిఎస్ డిటి కి షో కాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్లు రేషన్ షాపులు తిరిగి పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ఒకరిని సచివాలయానికి ఒక నోడల్ ఆఫీసర్ గా నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. మొదటి 5 రోజులు తహసీల్దార్లు ప్రతి రోజు ఎఫ్ పి డీలర్లతో సమీక్ష చేయాలని సూచించారు..రేషన్ సరుకుల పంపిణీలో ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, ఫిర్యాదులు వస్తే డీలర్ల మీద చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ డా. బి. నవ్య మాట్లాడుతూ ప్రతినెల 1వ తేదీ నుంచి 5వ తేదీ లోపు 65 సంవత్సరాలు పైబడిన కార్డుదారుల ఇంటి వద్దకే వెళ్లి సరుకుల పంపిణీ పూర్తిచేయాలన్నారు.. ఆ మేరకు తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు చర్యలు తీసుకోవాలని జేసి ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, డీఎస్ఓ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.


## ఆల్ ఇండియా ర్యాంకుల పేరుతో మోసం చేస్తున్న నారాయణ, శ్రీ చైతన్య పై చర్యలు తీసుకోవాలి



- ఎస్ఎఫ్ఐ

మనగళం, కర్నూలు :అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తూ డబ్బే ధ్యేయంగా విద్యాసంస్థలు నడుపుతున్న నారాయణ శ్రీ చైతన్య యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా రంగప్ప మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యను ఒక వ్యాపారంగా చేసుకుని పని చేస్తున్నటువంటి శ్రీ చైతన్య, నారాయణ యాజమాన్యాలు నిన్న జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ లో తమ కాలేజీల్లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులకే ఆల్ ఇండియా వ్యాప్తంగా మొదటి 50 ర్యాంకుల్లో తమకే వచ్చాయంటూ ప్రచారం చేసుకుంటూ పెద్ద ఎత్తున ఈరోజు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారన్నారు. కానీ అందులో గమనించినట్లయితే చాలావరకు ఒకే విద్యార్థి రెండు కాలేజీల్లో చదివినట్లు అబ్బాయికి వచ్చినట్లు పత్రికా ప్రకటన రావడం చూస్తుంటే పేద మధ్యతరగతి విద్యార్థులు తల్లిదండ్రులను ఏ విధంగా ఈ కాలేజ్ యాజమాన్యాలు మోసం చేస్తున్నాయో కళ్లకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు. ఇంతలా విద్య వ్యాపారం చేసుకొని పనిచేస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ఒకవైపు విద్యార్థుల జీవితాల గురించి ఆలోచిస్తున్నటువంటి తల్లిదండ్రులు ఇలా పేపర్లు ప్రకటనలు వచ్చినటువంటి వాటిని చూసి నిజం అనుకొని వారి పిల్లలను ఈ కాలేజీల్లో జాయిన్ చేయించడం జరుగుతుందన్నారు. మొదటిగా అడ్మిషన్ జాయిన్ అయ్యే టైంలోనే నీటు, జె ఈ ఈ మెన్స్ పేర్లతో లక్షలు దన్నుకుంటున్నాయి అన్నారు. ఇలా వందల సంఖ్యలో విద్యార్థులను తమ కాలేజీల్లో జాయిన్ చేయించుకుంటూ ఎక్కడో ర్యాంకులు తెచ్చినటువంటి విద్యార్థులు పేపర్ స్టేట్మెంట్లు ఇవ్వడం జరుగుతుంది. దీనిపైన ఏ అధికారి కూడా విచారం చేయించడం లేదు అలాగే జాయిన్ అయినటువంటి ప్రతి విద్యార్థి కూడా ఎందుకు సీట్ రావడం లేదని చెప్పేసి విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రశ్నించే పరిస్థితిలో కనిపించడం లేదన్నారు. దీన్ని అదునుగా భావించినటువంటి యాజమాన్యాలు ప్రతి సంవత్సరం ఇలా వందల సంఖ్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నటువంటి పరిస్థితి కనిపిస్తుందన్నారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ కాలేజీల పైన ఒక కమిటీని వేసి విచారణ చేయించి ఇప్పటివరకు ఈ నీట్ జెఈ మెయిన్స్ విద్యార్థులకు సంబంధించి ఎవరైతే ఫీజులు కట్టి సీట్లు రాకుండా పోయాయో వాళ్ళందరూ కూడా తిరిగి డబ్బును అందించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను వారి తల్లిదండ్రులు కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి దీక్షిత కుటుంబానికి ఆర్థికసాయం



మనగళం, చాగలమర్రి :మండలంలోని తోడెండ్లపల్లె గ్రామానికి చెందిన దీక్షిత అనే 4 సంవత్సరాల వయసు గల పాపను, మైలవరం మండలం మొరగుడి గ్రామానికి చెందిన రహమతుల్లా అనే కిరాతకుడు మానసికంగా, లైంగికంగా చిత్రహింసలు పెట్టి చంపేసి ముళ్ళపొదల్లో పడి వేయడం చాలా బాధాకరమని వైస్సార్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం చనిపోయిన దిక్షిత కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, నంద్యాల పార్లమెంట్ పరిశీలకులు కల్పలత రెడ్డి సమక్షంలో 2 లక్షల రూపాయలు చెక్కును ఆళ్ళగడ్డ మాజీ శాసనసభ్యులు శ్రీ గంగుల బ్రిజేంద్రారెడ్డి చిన్నారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ భాష, నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, శ్రీశైలం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి, వైఎస్ఆర్సీపీ నాయకులు భూమా కిషోర్ రెడ్డి, చాగలమర్రి ఎంపిపి వీరభద్రుడు, షేక్ బాబూలాల్, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



మనగళం, కర్నూలు :జై మన డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు మనవత్వాన్ని చాటుకున్నారు. కర్నూలుకు చెందిన ఫయాజ్ అనే డ్రైవర్ కు రోడ్డు ప్రమాదంలో నడుము భాగం దెబ్బతినడంతో ఆయన నడవడానికి కూర్చోడానికి ఇబ్బందిగా మారడంతో భాదితుడు ఫయాజ్ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో డ్రైవర్లు ఆయనకు ఆర్థికంగా సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. సౌదీ దేశంలో ఉంటున్న ఓడ్రైవర్ భార్య వరలక్ష్మి తన వంతుగా 10వేల రూపాయలు పంపారు. ప్రొద్దుటూరు డ్రైవర్లు 15 వేలను మొత్తం 25 వేల రూపాయలను భాదితుడికి అందించారు. సెఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్వర్ కోరినవెంటనే ఆదుకునేందుకు జై మన డ్రైవర్ అసోసియేషన్ నాయకులు ముందు రావడం విశేషం. ఫయాజ్ ఆపరేషన్ కు ఐదు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని దాతలు సహాయం అందించాలని వారు కోరారు. ఈకార్యక్రమం లో అన్వర్, శివ,వెంకటేశ్వర్లు,బళ్లారి రాంప్రసాద్, జగన్, వంశీ, మహబూబ్ బాష, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి ఆధ్వర్యంలో నేత్రదానం



మనగళం, నంద్యాల పట్టణంలోని బొంతల వీధికి చెందిన మారెం శ్రీదేవి ( 45 ) అనే అవివాహిత ఆమె మరణాంతరం ఆమె కోరిక మేరకు వారి అన్న మారెం రమేష్ బాబు ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి అధ్యక్షుడు ఫణింద్రకు, చైర్మన్ విష్ణు గాయత్రికి తెలియపరిచారు. వారు వెంటనే స్పందించి ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు బాపూజీ నాయక్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఐ బ్యాంకు వారికి తెలియపరిచి నేత్రాలను సేకరించి ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఫర్ సేవా సమితి అధ్యక్షుడు ఫణీంద్ర మాట్లాడుతూ మరణించిన తర్వాత వారి నేత్రాలు మట్టిలో కలిసిపోయే దాని కంటే నేత్రదానం చేయడం మంచిదన్నారు. ఒకరు నేత్రదానం చేయడం వలన 6 మందికి చూపు ప్రసాదించవచ్చునని తెలిపారు. దాదాపు ఇప్పటికే 65 మందికి పైగా అంధులకు చూపు వచ్చే విధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఎవరైనా మరణిస్తే మరణాంతరం నేత్రదానం చేయవలసిన కుటుంబ సభ్యులు నేత్ర ప్రాజెక్టు చైర్మన్ విష్ణు గాయత్రి కి తెలియపరచాలని పిలుపునిచ్చారు. నేత్రదానం చేయవలసిన సభ్యులు 7799056665 నెంబర్ కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భ్రమరాంబ, ప్రభాకర్, ఈ బ్లడ్ కోఆర్డినేటర్ కిషోర్, రమేష్ బాబు, అనిల్, సుధాకర్, సులోచన, ప్రదీప్ ,శైలజ, రెడ్ క్రాస్ టెక్నీషియన్స్ నాగన్న ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వైస్సార్ నగర్ లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- సరైన ధ్రువపత్రాలు లేని 05 మోటార్ సైకిల్లు స్వాధీనం
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మనగళం, నంద్యాల : నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ జావళి ఆల్ఫోన్స్ సూచనలతో మంగళవారం తెల్లవారుజామున జిల్లా పట్టణ కేంద్రంలోని ఎస్సార్ నగర్ నందు నంద్యాల తాలూకా ఇన్స్పెక్టర్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, క్యూ ఆర్ టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఎస్సార్ నగర్ లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనుమానితులు మరియు నేరచరిత్ర గలవారు, రౌడీ షీటర్ల ఇళ్లని తనిఖీచేసి సరైన ధ్రువపత్రాలు లేని 05 బైక్ లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అనంతరం ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సరైన పత్రాలు లేని వాహనాలను కొనడం, తాకట్టు పెట్టుకోడం, దొంగలించడం లాంటి పనులు చేయరాదని,గంజాయి రవాణా ,విక్రయం లాంటి నేరాలు చేస్తే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మరియు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రోడ్డు ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్ నేరాలు మొదలగు వాటిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలియజేశారు.రాత్రి వేళలో అనవసరంగా బయట తిరిగితే బౌండ్ ఓవర్ కేసులు పెడతామని రౌడీషీటర్ల మీద మరియు సస్పెక్ట్ షీటర్ల కదలికల మీద గట్టి నిఘా ఉంచడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు ఈశ్వరయ్య, వంశీధర్ ,చాంద్ బాషా మరియు సబ్ ఇన్స్పెక్టర్లు ధనమ్మ , నజీర్ లు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మేఘా పై నిషేధమా?

పేరుకు తగ్గట్టుగానే మేఘా అమెరికా గడ్డమీద ఘర్జించింది. ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని, అందుకు సహాయపడుతున్న అమెరికా విద్యాలయాల పరిశోధనలను ప్రశ్నించింది. కేవలం మాటలతోనే కాదు, రూపంతో కూడా పాలస్తీనాకు సంఘీభావంగా నిలిచింది. పాలస్తీనా అంతటా కమ్ముకున్న కారుమబ్బులను చీలుస్తూ మేఘా ఎం. వేమూరి మాటలు తూటాల్లా తాకాల్సిన వారికి తాకాయి. ఇప్పుడు ఆ ధిక్కార స్వరం ప్రపంచమంతటా ప్రతి ధ్వనిస్తోంది. ఆమె స్వరాన్ని ఆందులోని నిజాన్ని కోట్లాది నెటిజన్లు వింటూ, తమ మిత్రులకు చేరవేస్తున్నారు. పాలస్తీనాలో కోల్పోతున్న పసిపిల్లల ప్రాణాలు చూసినప్పుడు మానవతవాదులు ఎంతగా ఘోషించారో, మేఘా గొంతు విన్నప్పుడు అంతగా పులకించారు. పాలస్తీనా కోసం తన వ్యక్తిగత భవిష్యత్తును ఫణంగా పెట్టిన నవ యవ్వన విజ్ఞాన వేత్త, వీరవనిత మేఘా ఎం. వేమూరి. ఆమె మూలాలు మన తెలుగు గడ్డపై వున్నందుకు గర్విద్దాం, ఆమె ధైర్యానికి జేజేలు పలుకుదాం. 'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజా లో విశ్వవిద్యాలయాలు లేకుండా పోయాయి' అని అమెరికా, పాలస్తీనా విద్యావ్యవస్థల ద్వంద్వ స్వభావాన్ని ఒక్క వాఖ్యంలో మేఘా ప్రపంచానికి చాటారు. క్రమంగా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి అమెరికా అధ్యక్షుడు బరితెగిస్తూ విపరీత చర్యలు ప్రకటిస్తుంటే, అదే గడ్డపై నిలిచి అమెరికా విద్యాలయాల పరిశోధనలు ఇజ్రాయిల్ హింసోన్మాదానికి ఎలా సహకరిస్తున్నాయో బద్ధలు కొట్టినట్లు మాట్లాడడం చిన్న విషయం కాదు. 56 ఇంచుల ఛాతి వుందని చెప్పుకునే అతిపెద్ద పాలకులే ట్రంపు నోటికి ఎదురు మాట్లాడలేక మౌనంగా తలదాచుకుంటుంటే మదించిన గజాన్ని అంకుశంలా నియంత్రించడానికి మేఘా ప్రయత్నించింది. ఇది యువతలో పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేకత కు ఒక ప్రతిరూపం. తాను మాట్లాడేది ఏమిటో, ఆ తర్వాత ఏమి జరుగుతుందో, తన భవిష్యత్ ఎలాంటి ప్రమాదంలో పడుతుందో స్పష్టంగా తెలిసి మాట్లాడడం వెనుక ఆమెలో, ఆమెలాంటి అనేక మంది యువతలో, విద్యాలయాల్లో మెదలుతున్న ఆలోచనలకు ప్రతిబింబం. ప్రపంచానికి ప్రాజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం అంటూ నీతులు చెప్పే అమెరికా వాటిని ఎలా కాలరాస్తోందో మేఘా, ఆమె కుటుంబంపైన విధించిన నిషేధ చర్యలు మరోసారి బట్టబయలు చేశాయి. అమెరికాలో ప్రతిష్టాత్మకమైన మస్సాచ్ సెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో మే 29న గ్రాడ్యుయేషన్ వేడుక సందర్భంగా జరిగింది. ఈ విద్యాలయంలో సీటు రావడం, డిగ్రీ పూర్తి చేయడం ప్రపంచంలో చాలా కొద్దిమందికి దొరికే అరుదైన అవకాశం. మన తెలుగు సంతతికి చెందిన మేఘా కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, లింగ్విస్టిక్స్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసింది. ఆమె ఎంఐటిలో 2025 సంవత్సరానికి క్లాసు ప్రెసిడెంట్‌గా (మన యూనివర్సిటీల్లో ఛైర్మెన్ హోదా) వుంది. గ్రాడ్యుయేషన్ వేడుకల్లో క్లాసు ప్రెసిడెంట్‌గా మాట్లాడే అవకాశం ఆమెకు వచ్చింది. తన భావాలను వ్యక్తం చేయడానికి ఇది సరైన సందర్భంగా ఆమె భావించింది. ఇజ్రాయిల్ దురాక్రమణకు గురవుతున్న పాలస్తీనాకు మద్దతుగా సాంప్రదాయ ఎరుపురంగు కెఫియే కండువా ధరించి 'మనం డిగ్రీలు పూర్తి చేసి భవిష్యత్‌లోకి అడుగిడుతున్న ఈ సమయంలో, గాజాలో విద్యాలయాలే లేకుండా పోయాయని' అంది. 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి మన దేశమే (అమెరికా) కాదు, మన కళాశాల కూడా అలాంటి దాడిని ప్రోత్సహించడానికి సహాయపడుతుండడం సిగ్గుగా వుంది'. ఎంఐటిలో చేస్తున్న కీలక పరిశోధనలు ఇజ్రాయిల్ దళాలకు సహాయపడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఎంఐటి పరిశోధన సంబంధాలను కలిగివున్న ఏకైక విదేశీ సైన్యం ఇజ్రాయిల్' అని చెప్పింది. యువత మేధో విజ్ఞానం పాలస్తీనా వినాశానికి సహాయపడడాన్ని ఆమె ప్రశ్నించింది. 'పాలస్తీనాను భూమి నుండి తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని' ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని నిర్భీతిగా ప్రకటించింది. 'ఉద్దేశపూర్వకంగా కార్యక్రమ సమయాన్ని, నియమాలను మేఘా ఉల్లఘించిందని' ఎంఐటి యాజమాన్యం ఆమెను, ఆమె తల్లిదండ్రులను క్యాంపస్ నుండి బహిష్కరించారు. ఆ వెంటనే మన దేశంలో లాగే అక్కడ కూడా మత, జాతి ఉన్మాద ముష్కరులు మేఘా, ఆమె కుటుంబం పైన సోషల్ మీడియాలో వికృత ట్రోలింగ్ చేశారు. మరోవైపు ప్రపంచంలోని అనేక దేశాల యువత, విద్యార్థులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. మేఘా తెలివైన విద్యార్థిని. ప్రపంచ ప్రఖ్యాత ఎంఐటి విద్యార్థి నాయకురాలు. ఆమె తాత్కాలిక ఆవేశంతో మాట్లాడిన మాటలు కావు అవి. గత కొన్ని సంవత్సరాలుగా పాలస్తీనాలో జరుగుతున్న జాతి దురహంకారం గురించి తాను వింటున్న, చూస్తున్న ఘటనలకు మేధోవంతురాలి స్పందన అది. జార్జియాలోని అల్ఫారెట్టాలో పుట్టిపెరిగిన మేఘా ప్రాథమిక విద్య అక్కడే పూర్తి చేసింది. విద్యార్థి దశలోనే జోర్డాన్‌లోని హైస్కూల్ విద్యార్థుల కోసం న్యూరోసైన్స్ పాఠ్యాంశాల కరికులమ్ రూపొందించింది. 2021లో అమెరికాలో నేషనల్ మెరిట్ అవార్డు సాధించి ఎంఐటిలో స్థానం దక్కించుకుంది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి క్లాసు ప్రెసిడెంట్‌గా ఎన్నికై చదువుతోపాటు సామాజికస్పృహలో ముందుంది. ప్రపంచాన్ని ముఖ్యంగా పాలస్తీనాలో జరుగుతున్న పరిణామాలను విజ్ఞతతో నిశితంగా పరిశీలించింది. భావాలను ధృఢపరుచుకుంది. సందర్భం వచ్చినప్పుడు స్పష్టంగా ప్రకటించింది. విద్యాలయాల్లో భిన్న దృక్పధాలు, ప్రశ్నించేతత్వం లేకుండా విజ్ఞానం వికసించదు. కళ్లెదురుగా జరుగుతున్న దుర్మార్గాలను, అన్యాయాలను, వాటి మూలాలను పరిశోధించడం, తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించడం విద్యకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని మేఘా గుర్తించింది, ఆచరించింది. ఆ మాత్రపు ప్రశ్నను కూడా ప్రపంచంలోని అనేక దేశాధినేతలు, వారి అనుయాయులు సహించలేకపోవడం నేటి వ్యవస్థలో వున్న అతిపెద్ద బలహీనత. కొద్ది నెలల క్రితం అమెరికాలోని ప్రిన్టన్ యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శనలో పాల్గొన్న 110 మంది విద్యార్థులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తమిళనాడుకు చెందిన అచింతన్ శివలింగన్ అనే అమ్మారు హసన్ సయ్యద్ అనే అబ్బాయి కూడా ఉన్నారు. సామ్రాజ్యవాదం ఇంతగా నిర్బంధాలకు పాల్పడుతుందంటే దానికి ప్రతిఘటన పెరుగుతుందని స్పష్టమవుతుంది. మేఘాకు అండగా మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, కేంద్ర ప్రభుత్వంలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఆమెపై విధించిన నిషేధాన్ని తొలగించేందుకు తోడ్పడాలి. మహిళల హక్కుల గురించి మాట్లాడే పవన్ కల్యాణ్ ఈ ఘటనపై తక్షణం మాట్లాడుతారని ఆశిద్దాం. రాష్ట్రంలోని విద్యార్థులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు స్పందించి మేఘా ఎం వేమూరికి అండగా నిలుద్దాం.

# నంద్యాల జిల్లా కలెక్టర్ మీరైన స్పందించండి

**- డోన్ లోని కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలి**

మన గళం డోన్ లో ఈ విద్యా సంవత్సరానికి 2025-26 నోటిఫికేషన్ కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నంద్యాల జిల్లా కలెక్టర్ గారైన మీరు మరియు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ గారు డోన్‌లోని ప్రభుత్వ ఐ.టి.ఐ లో తాత్కాలిక తరగతి గదులను, వసతులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేయడం వలన డోన్ ప్రజల ఆశలు చిగురించాయి. అయితే ఇప్పటివరకు అడ్మిషన్లు ప్రక్రియ మొదలు కాకపోవడంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, అధికారుల సమన్వయ లోపంతో రెండు విద్యా సంవత్సరాలు వృధాగా గడిచిపోయాయి. 2025-26 మూడవ విద్యా సంవత్సరం అయినా ప్రారంభిస్తారని డోన్ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ విద్యా సంవత్సరం మొదలు కావడానికి చాలా తక్కువ సమయం కేవలం 10 రోజులు మాత్రమే ఉందని,డోన్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు,దయచేసి ఈ విద్యా సంవత్సరం నష్ట పోకుండా చూడాలని. లేకపోతే ఎంతో మంది పిల్లలు కోలుకోలేని నష్టాన్ని పొందుతారు. ముక్యంగా కేంద్రీయ విద్యాలయములో ప్రవేశాలు జరిగితే 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల ను తీసుకుంటే దాదాపుగా 200మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని, ఒక వేల ప్రవేశాలు జరగకుంటే 200 మంది విద్యార్థులు నష్టపోతారు కావున అధికారుల సమన్వయ తో ముందుగా తాత్కాలిక భవనములో నడపాలని, వెంటనే నంద్యాల జిల్లా కలెక్టర్ గారు స్పందించి సమస్యను పరిష్కరించండానికి సంబంధిత అధికారుల కు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాముఒక వేల మీరు చర్య తీసుకోని పక్షములో అన్ని విద్యార్థి సంఘాలను,



ప్రజాసంఘాలను, రాజకీయ పార్టీ లను ఏకం చేసుకొని ఉద్యమాన్ని చేపడుతం.

# వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమము

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో ఈరోజు కోడుమూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో కేవీకే బనవాసి వారు సైంటిస్టులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమమును సైంటిస్ట్ మౌనిక మేడం గారు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి కర్నూల్ ఏడిఏ ఎన్ సాల్ రెడ్డి సార్ గారు మరియు డిఆర్సి ఏడిఏ అన్నపూర్ణమ్మ గారు మరియు ఉద్యాన అధికారి మదన్మోహన్ మరియు మండల వ్యవసాయ అధికారి ఎన్ రవి ప్రకాష్ మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపడుతున్న వివిధ రకాల రైతు సంబంధిత సంక్షేమ పథకాలను మరియు అభివృద్ధి కార్యక్రమాలను రైతులకు పూర్తిగా తెలియపరచుట కొరకు ఏర్పాటు చేయబడిన సమావేశం. మరియు నూతన సాంకేతిక సాగు పద్ధతులను ఖరీఫ్ సీజన్ కు ప్రారంభంలోనే రైతులకు తెలియపరచి మంచి దిగుబడులు సాధించడానికి రైతులతో పాటు శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు బృందంగా ఏర్పడి మంచి దిగుబడులు సాధించడానికి మరియు అధిక ఆదాయమును సాధించడానికి నిర్వహిస్తున్న కార్యక్రమం అని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు స్థానిక అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు




# కోడుమూరు మండలం నందు సిసిహెచ్ లకు ట్రైనింగ్ కార్యక్రమం

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలం నందు సిసిహెచ్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా మండలవిద్యా శాఖ అధికారి తైమూర్ భాష గారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వంట ఏజన్సీలకు శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈశిక్షణకు జిల్లా స్థాయినుండి రాష్ట్రస్థాయి కి వెళ్లి వచ్చిన శ్రీమతి లలితమ్మ మండలంలోని సిసిహెచ్ లకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన వారం రొజుల మెను ఎలా నిర్వహించాలి ఎ విధంగా చేసుకోవాలి వంట చేసేటప్పుడు తీసుకోవాలసిన జాగ్రత్తలు మొదలగు అన్ని విషయాలను గురించి శిక్షణ నందు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ టైముర్ భాష మాట్లాడుతూ వంట ఏజెన్సీలు మెనును తప్పక పాటిస్తూ నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థుల కు అందచేయలని తెలియచేశారు. అలాగే పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఈ శుభ్రత విషయం అందరూ కచ్చితంగా పాటించాలని వారు తెలియజేశారు ఈ సందర్భంగా ఎంఈఓ వసంత లక్ష్మి భాయ్ మాట్లాడుతూ డొక్క సీతమ్మని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారము అందివ్వాలని వారు తెలియచేశారు. పిదప వంట నిర్వాహకులు స్వయంగా వంట చేసి శిక్షకురాలిచే వంట నిర్వహనపై మెళకువలు తెలుసుకోవడం జరిగింది. పాఠశాలలు తెరిచిన వెంటనె నాణ్యమైన ఆహారాన్ని అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు సిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు





# యూరిక్ యాసిడ్ ఎక్కువై ఇబ్బంది పడుతున్నారా..?



మనగళం : ప్రస్తుత రోజుల్లో చాలా మందిని వేధించే ఆరోగ్య సమస్యలలో యూరిక్ యాసిడ్ పెరగడం ఒకటి. ఇది చిన్న సమస్యలా అనిపించినా.. దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయగలదు. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, వాపులు, కాళ్ళు చేతులు నొప్పించడం వంటి సమస్యలు ఈ స్థితికి సంబంధించినవే. శరీరంలో ప్యూరిన్ అనే పదార్థం విచ్ఛిన్నమైనప్పుడు యూరిక్ యాసిడ్ అనే వ్యర్థ పదార్థం ఏర్పడుతుంది. ఇది సాధారణంగా మూత్రం ద్వారా బయటకు వెళుతుంది. కానీ శరీరం సరిగా దీన్ని బయటకు పంపకపోతే అది రక్తంలో చేరి కీళ్లలో చేరుతుంది. దీనితో కీళ్లలో వాపు, నొప్పి, నడవలేకపోవడం వంటి ఇబ్బందులు వస్తాయి. ఈ పరిస్థితిని సహజంగా నియంత్రించాలంటే కొన్ని రకాల ఆహార పదార్థాలు ఎంతో ఉపయోగపడతాయి. వాటిలో ముఖ్యంగా పచ్చి బొప్పాయి ముందు వరుసలో ఉంటుంది. ఇందులో విటమిన్ ఎ, సి, మెగ్నీషియం, కాల్షియం, ఫైబర్ వంటి ఎన్నో పోషకాలున్నాయి. ఇవి శరీరాన్ని శుద్ధి చేయడంలో, అంతర్గతంగా వ్యర్థాలను తొలగించడంలో మెరుగైన పనితీరును చూపిస్తాయి.యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించేందుకు బొప్పాయిని కషాయంగా తయారు చేసి తీసుకోవడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరానికి తేలికగా జీర్ణమై, రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. బొప్పాయి కషాయాన్ని తయారు చేయడం చాలా సులువు. తాజా పచ్చి బొప్పాయిని చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక గిన్నెలో ఒక గ్లాసు నీరు వేసి.. అందులో ఈ ముక్కలను సుమారు 5 నిమిషాలు మరిగించాలి. మరిగిన తర్వాత వాటిని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. ఆ రసాన్ని వడగట్టి ఒక కప్పులోకి పోసి చిటికెడు రాతి ఉప్పు కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగితే మంచిది. ఇది యూరిక్ యాసిడ్ ను సహజంగా నియంత్రించడంలో సహాయపడుతుంది.ఈ ప్రక్రియను వారంలో మూడుసార్లు అనుసరిస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అయితే దీన్ని వైద్యుల సలహా మేరకు తీసుకోవడం ఉత్తమం. ఎప్పటికప్పుడు యూరిక్ యాసిడ్ స్థాయిలను పరీక్షించుకుంటూ.. ఆహారం జీవనశైలి మార్పులు చేసుకుంటే ఈ సమస్యను అదుపులో ఉంచవచ్చు.పచ్చి బొప్పాయితో తయారైన ఈ కషాయం ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా వ్యర్థ పదార్థాల తొలగింపులో సహాయపడుతుంది.

## ఎవ్వరినైనా తాకితే షాక్ కొడుతుందా..?




మనగళం : కొన్నిసార్లు మనం ఎవ్వరినైనా తాకినప్పుడు చేతిలో ఓ చిన్న విద్యుత్ షాక్ లాంటి అనుభూతి కలుగుతుంది. ఇది కొద్దిసేపు అసౌకర్యంగా ఉంటుంది. వెంటనే మనం చేతి స్పర్శను తొలగించేస్తాం. ఇది అందరికీ జరగదు. కొంతమందిలో మాత్రమే కనిపించే సమస్య ఇది. దీనికి కారణం ఏంటి అని మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? విటమిన్ బి12 తక్కువగా ఉండే వారికి ఈ రకమైన షాక్ అనిపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ విటమిన్ శరీరంలో ఎర్ర రక్త కణాల తయారీకి ఉపయోగపడుతుంది. అదే సమయంలో మన నరాల ఆరోగ్యానికి కూడా ఇది అవసరం. ఈ విటమిన్ తక్కువైతే నరాలు బాగా పని చేయలేవు. అందుకే స్పర్శ సమయంలో విద్యుత్ లాంటి అనుభూతి కలగవచ్చు. విటమిన్ బి12 శరీరంలో చాలా ముఖ్యమైన పనులు చేస్తుంది. ఇది మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. శరీరంలోని డిఎన్ఎ తయారీకి కూడా సహాయపడుతుంది. ముఖ్యంగా నరాల నిర్మాణంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ తక్కువగా ఉన్నప్పుడు నరాలు బలహీనంగా మారుతాయి. దీన్ని తగ్గించడానికి మాంసం, గుడ్లు, పాల సంబంధిత పదార్థాలు తినడం మంచిది. ఇవి విటమిన్ బి12ను సహజంగా అందిస్తాయి. మన శరీరంలోని నరాలు మెదడు నుండి శరీరంలోని వివిధ భాగాలకు సంకేతాలను పంపుతుంటాయి. ఇవి ఎక్కడైనా దెబ్బతిన్నా, ఇబ్బంది వచ్చినా ఆ సంకేతాలు తప్పుగా పంపబడతాయి. దీని వల్ల షాక్ అనిపించవచ్చు. కొన్నిసార్లు సయాటికా వంటి నరాల సమస్యలు లేదా నరాలపై ఒత్తిడి పడటం కూడా కారణం కావచ్చు. వెనుక భాగంలో గాయం జరిగినా లేదా వెన్నెముకకు సంబంధించిన ఏదైనా ఇబ్బంది ఉన్నా ఈ సమస్య రావచ్చు. డయాబెటిస్ ఉన్నవారికి ఈ షాక్ అనిపించడమే కాదు.. కొన్ని మందుల వల్ల కూడా నరాలపై ప్రభావం పడుతుంది. కొన్ని ఇన్ఫెక్షన్ల వల్ల కూడా నరాలకు ఇబ్బంది కలిగి స్పర్శ సమయంలో అసాధారణ స్పందన రావచ్చు. ఇతరులను తాకినప్పుడు చెయ్యిలో షాక్ అనిపిస్తే అది చిన్న సమస్యగా భావించొద్దు. ఇది మీ శరీరంలో కొంత లోపం ఉందని సూచించే సంకేతం కావచ్చు. విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం చాలా ముఖ్యం. అవసరమైన ఆహారం తీసుకుంటే ఈ సమస్య తగ్గవచ్చు. ఎక్కువగా కొనసాగితే వైద్యుని సంప్రదించండి.

## టమాటా కేవలం కూరలకే కాదు.. ఆరోగ్యానికి మస్తు పని చేస్తుంది..!



మనగళం : టమోటా మనం ప్రతి రోజు కూరల్లో వాడే పదార్థం. కానీ దీని లో దాగిన ఆరోగ్య రహస్యాలు చాలా మందికి తెలియవు. తల నుంచి కాలి వరకు శరీరానికి టమోటా ఉపయోగపడుతుంది. ఇది కేవలం రుచికే కాకుండా ఆరోగ్యానికి కూడా సహాయకారి. టమోటా విటమిన్లు, ఖనిజాలు అధికంగా కలిగి ఉంటుంది. దీనిలో ఉండే పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. టమోటాలో ఉండే విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, విటమిన్ కె వంటి పదార్థాలు ఆరోగ్యానికి అవసరం. ఇవి ఇమ్యూనిటీని పెంచుతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకలకు బలాన్నిస్తాయి.టమోటాలో లైకోపీన్ అనే పదార్థం గుండెను రక్షించడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని హానికరమైన కొవ్వును తగ్గించడంలో ఉపయోగపడుతుంది. గుండె జబ్బులు, స్ట్రోక్, డయాబెటిస్ వంటి సమస్యల ముప్పు తగ్గుతుంది. ముఖ్యంగా ప్రతి వారం రెండుసార్లు టమోటా వాడటం గుండెకు మంచిది.టమోటాలో లూటిన్, బీటా కెరోటిన్ ఉండటం వల్ల కళ్ళకు మేలు జరుగుతుంది. వయస్సు పెరిగినప్పుడు వచ్చే కంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. కంటి చూపు మెరుగుపడుతుంది. మాక్యులర్ డిజెనరేషన్ అనే కంటి సమస్య రాకుండా నివారిస్తుంది. టమోటా శరీరంలో జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఫ్రీ రాడికల్స్ వల్ల జరిగే హానిని తగ్గిస్తుంది. ఇవి కొలెస్ట్రాల్‌పై ప్రభావం చూపకుండా అడ్డుకుంటుంది. దాంతో గుండె సంబంధిత సమస్యలు రాకుండా కాపాడుతుంది.2017లో చేసిన పరిశోధన ప్రకారం టమోటా తినడం వల్ల శరీరంలో కెరోటినాయిడ్లు పెరుగుతాయి. ఇవి సూర్యుడి కిరణాల వల్ల వచ్చే చర్మ సమస్యలను తగ్గిస్తాయి. ఇలా టమోటా చర్మాన్ని క్యాన్సర్ వంటి రోగాల నుంచి కాపాడుతుంది.2019లో టోక్యోలో చేసిన పరిశోధన ప్రకారం ఉప్పు లేకుండా చేసిన టమోటా రసం తాగితే రక్తపోటు తగ్గుతుంది. దాదాపు 500 మంది వ్యక్తులపై చేసిన పరీక్షల్లో ఇది బుజువైంది. అందులో 94 మందికి రక్తపోటు ఉన్నా మందులు వాడకుండానే టమోటా రసం తాగడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయి. చెడు కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. ఆ అధ్యయనంలో 125 మందికి చెడు కొలెస్ట్రాల్ స్థాయి గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. టమోటా రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల హృదయ సంబంధిత ప్రమాదాల ముప్పు తగ్గుతుంది. టమోటా కేవలం వంటకాల్లో రుచి కోసం మాత్రమే కాదు.. ఆరోగ్యాన్ని కాపాడే సహజ ఔషధంగా తీసుకోవచ్చు. ప్రతి రోజు కొంచెం టమోటా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. ఇది తక్కువ ఖర్చుతో వచ్చే ఆరోగ్య రహస్యం.

# మెడనొప్పితో బాధపడుతున్నారా..?



మనగళం : రోజూ మనలో చాలా మందికి మెడ నొప్పి సమస్య ఎదురవుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ ముందు ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగుల్లో ఈ నొప్పి సాధారణంగా కనిపిస్తుంది. కొందరికి తేలికపాటి నొప్పి ఉన్నా, మరికొందరికి అది తీవ్రంగా ఉండి పని చేయలేని స్థితికి దారి తీస్తుంది. రోజూ చేసే పనులు, సరిగా లేని భంగిమ, ఎక్కువసేపు కూర్చోవడం, ఎత్తైన దిండు వాడటం, నిద్ర లేకపోవడం, గాయాలు, వెన్నెముక సంబంధిత సమస్యలు, బరువులు ఎత్తడం వంటివి మెడ నొప్పికి కారణం కావచ్చు. అకస్మాత్తుగా వచ్చిన కండరాల నొప్పులు కూడా ఈ సమస్యను పెంచుతాయి. మెడ నొప్పి తేలికపాటిది కావచ్చు. కొన్ని సందర్భాల్లో మాత్రం తీవ్రమైన స్థాయికి వెళ్తుంది. మెడ కదలడంలో ఇబ్బంది, బిగుసుకుపోవడం, కత్తిపోటులాంటి నొప్పి అనుభూతి, తల కదిలించేటప్పుడు అసౌకర్యం, భుజం నుంచి చేతులకూ వ్యాపించే నొప్పి, తిమ్మిర్లు, బలహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చు. నిరంతరంగా నొప్పి ఉంటే డాక్టర్ ను కలవడం అవసరం. అయితే చిన్నపాటి లక్షణాలకు ఇంట్లోనే పరిష్కారాలు అందుబాటులో ఉన్నాయి. మెడకు హాట్ ప్యాక్ లేదా ఐస్ ప్యాక్ వేయడం వల్ల మంచి ఉపశమనం కలుగుతుంది. వేడి నీరు కండరాలను సడలించి రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. ఐస్ వాడటం వల్ల నొప్పి తగ్గుతుంది. బట్టలో ఐస్ క్యూబ్స్ పెట్టి వాడవచ్చు. వేడి నీటిలో తడిపిన బట్టను మెడపై పెట్టడం ద్వారా కూడా ఉపశమనం పొందవచ్చు.నెమ్మదిగా మెడను కదిలించడం, వంచడం, చుట్టేసేలా కదలికలు చేయడం వల్ల కండరాలు బలపడతాయి. ఈ వ్యాయామాలు ఎటువంటి ఒత్తిడి లేకుండా నెమ్మదిగా చేయాలి. నొప్పి ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపిస్ట్ ను సంప్రదించడం మంచిది. మెడ నొప్పిని తగ్గించుకోవడానికి కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. నిద్రపోతున్నప్పుడు ఎత్తైన దిండు వాడటం మానేయాలి. పని చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో కాసేపు నిలబడటం మంచిది. అలాగే మీరు కూర్చునే కుర్చీ సౌకర్యవంతంగా ఉందో లేదో చూసుకోండి, మెడపై అనవసరమైన ఒత్తిడి పడకుండా జాగ్రత్తపడండి. వేసవిలో ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవాలి, నీరు ఎక్కువగా తాగడం వల్ల వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం మెడ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మెడ నొప్పి సాధారణ సమస్య అయినా ఎక్కువ రోజులు కొనసాగితే తప్పకుండా డాక్టర్ ను కలవాలి. ఇంట్లో అనవసరంగా పరీక్షలు చేయకుండా నేరుగా నిపుణుడిని సంప్రదించాలి. నొప్పికి అసలు కారణం తెలుసుకొని సరైన చికిత్స పొందడం అవసరం. సమయానికి తీసుకునే జాగ్రత్తలు మిమ్మల్ని తీవ్రమైన సమస్యల నుండి కాపాడుతాయి.

బుధవారం
04 - 06 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# తెలుసు కదా.. భలే మంచి డేటు పదా



మనగళం : టిల్లు సిరీస్ లో రెండు సినిమాలు బ్లాక్ బస్టరయ్యాక సిద్దు జొన్నలగడ్డకు జాక్ ఇచ్చిన షాక్ మామములుది కాదు. కనీసం యావరేజ్ అయినా ఏదోలే అని సర్దుకోవచ్చు కానీ దారుణంగా డిజాస్టర్ కావడం ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోయారు. ఒక రకంగా చెప్పాలంటే కంటెంట్ బాలేకపోతే ఓపెనింగ్స్ తెచ్చే రేంజ్ కు సిద్దు ఇంకా చేరుకోలేదనే మెసేజ్ అయితే జాక్ ఇచ్చింది. ఇప్పుడు నెక్స్ట్ తెలుసు కదాతో రాబోతున్నాడు. అక్టోబర్ 17 విడుదల చేయబోతున్నట్టు టీమ్ అధికారికంగా ప్రకటించింది. నీరజ కోన దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ లవ్ ఎంటర్ టైనర్ కు తమన్ సంగీతం సమకూర్చాడు. ఇది భలే డేటు అనడానికి కారణాలున్నాయి. దసరా పండగ అయిపోయిన తర్వాత స్లాట్ తీసుకోవడం కొందరికి కరెక్ట్ అనిపించకపోవచ్చు కానీ ప్యాన్ ఇండియా మూవీస్ తో తక్కువ గ్యాప్ లో తలపడి కలెక్షన్లు దెబ్బ తీసుకోవడం కన్నా ఇదే మంచి నిర్ణయం. అక్టోబర్ మూడో వారం నాటికి వార్ 2, కూలి, మాస్ జాతర, ఓజి, అఖండ 2, కాంతార చాప్టర్ 1 తదితర సినిమాల థియేటర్ రన్ పూర్తయిపోయి ఉంటుంది. సో తెలుసు కదాకు టాలీవుడ్ వరకు సోలో ఛాన్స్ దక్కుతుంది. అదే తేదీకి రష్మిక మందన్న బాలీవుడ్ హారర్ మూవీ తమని అనౌన్స్ చేశారు కానీ ఖచ్చితంగా వస్తుందా అనేది ఇప్పుడే చెప్పలేం. ఒకే ఏడాదిలో రెండు సినిమాలు రిలీజ్ చేయడం ద్వారా సిద్ధూ జొన్నలగడ్డ స్పీడ్ పెంచినట్టే అనుకోవాలి. తెలుసు కదాలో హిట్ 3 భామ శ్రీనిధి శెట్టితో పాటు రాశి ఖన్నా హీరోయిన్ గా నటించింది. పైకి ముక్కోణపు ప్రేమకథగా కనిపించినా సర్ప్రైజ్ ఎలిమెంట్స్ చాలా ఉంటాయని టీమ్ చెబుతోంది. మ్యూజికల్ గా తమన్ లోని కొత్త షేడ్ ని ఇందులో చూడొచ్చని అంటున్నారు.

# "చెన్నై లవ్ స్టోరీ" టైటిల్, గ్లింప్స్ రిలీజ్




మనగళం : సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం, యంగ్ టాలెంటెడ్ హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫొటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన దర్శక నిర్మాత సాయి రాజేశ్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీకి "చెన్నై లవ్ స్టోరీ" టైటిల్ ఖరారు చేశారు. ఈ రోజు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా చేతుల మీదుగా ఈ సినిమా టైటిల్ తో పాటు గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై సాయి రాజేశ్, ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. తొలి ప్రేమేం తోపు కాదు, ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుందని చెబుతూ సాగిన గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్ లో హీరో కిరణ్ అబ్బవరం ఫ్రెష్ లుక్ లో కనిపిస్తున్నారు. శ్రీ గౌరి ప్రియ స్క్రీన్ ప్రెజెన్స్ ఇంప్రెస్ చేసింది. సముద్రపు ఒడ్డున ఈ జంట ఫస్ట్ లవ్, బెస్ట్ లవ్ గురించి మాట్లాడుకున్న సంభాషణ ఆసక్తికరంగా, ఆలోచింపజేసేలా సాగింది. 'తొలి ప్రేమకు మరణం లేదు' అనే "బేబి" సినిమాలోని ఫేమస్ డైలాగ్ ను హీరోయిన్ చెబుతూ తొలిప్రేమే గొప్పదని అంటుంది. అందుకు హీరో స్పందిస్తూ 'తొలి ప్రేమేం తోపు కాదు, ఫస్ట్ లవ్ ఫెయిలైతే బెస్ట్ లవ్ ఎక్కడో మొదలువుతుంది..' అని సమాధానం చెబుతాడు. అంతం వరకు అనంతమై సాగే ఈ జీవితంలో తొలి ప్రేమ ఒక మజిలీ మాత్రమేనని, అదే తుది కాదనే కాన్సెప్ట్ ను ఈ గ్లింప్స్ ద్వారా మేకర్స్ అందంగా తెలియజేశారు. ఈ గ్లింప్స్ కు 'తొలి ప్రేమే తోపు కాదే తోపు కాదే..' అంటూ మెలోడీ బ్రహ్మ మణిశర్మ బ్యూటిఫుల్ బీజీఎం సాంగ్ కంపోజ్ చేశారు.




# దేవి హై వోల్టేజ్ బీట్స్‌లో 'అనగనగా కథ'

మనగళం :శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' సినిమా విడుదల విషయంలో కాస్త ఆలస్యంగా వస్తున్నప్పటికీ పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేస్తోంది. లీడర్ తరువాత మళ్ళీ అలాంటి ఫీల్ కలిగిస్తోన్న కమ్ముల తప్పకుండా కమర్షియల్ బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తాడని ఓ వర్గం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సోషల్ థ్రిల్లర్, సమాజంలోని ఆర్థిక అసమానతలు, అధికార ఆకాంక్షల చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. వీరమల్లు.. ఆ విషయంలో నిర్మాత పర్ఫెక్ట్ డిసిషన్! జిమ్ సర్భ్, దలీప్ తాహిల్ కీలక పాత్రల్లో కనిపించనున్న ఈ సినిమాలో తొలిసారి నాగార్జున, ధనుష్ కలిసి నటిస్తుండటంతో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏషియన్ సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ రావు నిర్మాణంలో ఈ సినిమా జూన్ 20న విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్, 'పోయిరా మామా' సాంగ్‌తో అభిమానులను ఆకర్షించింది. ధనుష్ ఒక బిచ్చగాడి పాత్రలో, నాగార్జున ఒక ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా, రష్మిక మిడిల్ క్లాస్ అమ్మాయిగా కనిపించనున్నట్లు టీజర్ హైలెట్ చేసింది. సినిమా సమాజంలో అంతరాలు, ఆర్థిక వ్యవస్థపై ఆలోచింపజేసే కథనంతో రూపొందుతోందని తెలుస్తోంది. ఇప్పుడు ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'అనగనగా కథ' విడుదలై, అందరినీ ఆకట్టుకుంటోంది. దీపికా ఇక్కడ తగ్గిందా? దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన 'అనగనగా కథ' సాంగ్, రాక్ బీట్స్‌తో సమాజ సత్యాలను తెరపైకి తెచ్చింది. హైడ్ కార్తీ, కరీముల్లా ఆలపించిన ఈ పాట, ధని పేద అంతరాలను, అణచివేతను గురించి ఆలోచింపజేసేలా ఉంది. ఆస్కార్ విజేత చంద్రబోస్ రాసిన సాహిత్యం అత్యంత అర్థవంతంగా, సినిమా కథను ప్రతిబింబించేలా ఉంది. ఈ పాట సమాజంలోని ఆర్థిక వ్యత్యాసాలను, అణగారిన వర్గాల బాధలను తీవ్రంగా చూపిస్తూ, ఆలోచనలో ముంచెత్తింది. లిరికల్ వీడియోలో ఉపయోగించిన ఫోటోల్లో నాగార్జున, ధనుష్ కెమిస్ట్రీ స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా పాత్రల వివరాలు స్పష్టంగా తెలియకపోయినా, వీరిద్దరి పాత్రల తీవ్రత అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ సాంగ్ సినిమా కథను మరింత లోతుగా పరిచయం చేస్తూ, ఆర్థిక డ్రామాకు సరైన నేపథ్యాన్ని సిద్ధం చేసిందని అభిమానులు అంటున్నారు.

# డేంజర్ బాయ్స్' వస్తున్నారు



మనగళం : కన్నడలో అనూహ్య విజయం సాధించిన 'అపాయవీడి హెచ్చరిక' చిత్రం 'డేంజర్ బాయ్స్' పేరు తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. దర్శకనిర్మాత శ్రీరంగం సతీష్ కుమార్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ -రిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్ 'డేంజర్ బాయ్స్' ఫస్ట్ లుక్ రిలీజ్ చేయగా.. టీజర్ ను దర్శకనిర్మాత డాక్టర్ లయన్ సాయివెంకట్, పాటలను ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు సత్యవర్ధన్ విడుదల చేశారు. ట్రైలర్‌ను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షులు వీర శంకర్ ఆవిష్కరించారు. దండుపాళ్యం, కేజిఎఫ్, కాంతారా చిత్రాల కోవలో.. కన్నడలో అనూహ్య విజ యం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ సంచలనం సృష్టించడం ఖాయమని అతిథులు పేర్కొన్నారు. ఈ ట్రైలర్, సాంగ్స్ చూస్తుంటే.. ఈ చిత్రం మరో 'మంజమల్ బాయ్స్' అవుతుందనిపిస్తోందని వారు తెలిపారు. యశశ్విని క్రియేషన్స్, - గీతా ఫిలిమ్స్ పతాకాలపై శ్రీరంగం సతీష్ కుమార్ సమర్పణలో వి.జి.మంజునాథ్, - పూర్ణిమ ఎమ్.గౌడ్ నిర్మించిన ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు అభిజిత్ తీర్థహళ్లి.

## ఫైనల్ ముందు యోగ్‌రాజ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు



మనగళం : 2025 ఫైనల్ ముందు టీమిండియా మాజీ ఆటగాడు యోగ్ రాజ్ సింగ్ విరాట్ కోహ్లీపై పెద్ద అంచనాలు వేసారు. పవర్‌ప్లేలో విరాట్ ఔటవ్వకపోతే, అతను 250-300 పరుగులు ఛేస్ చేయగలడని అన్నారు. పంజాబ్ గెలుపు కోసం విరాట్ వికెట్ అత్యంత కీలకం అని ఆయన పేర్కొన్నారు. ఈ సీజన్‌లో విరాట్ 614 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరుచుకున్నాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌ను యోగ్ రాజ్ సింగ్ ప్రశంసించి, అతని ఆట కూడా గేమ్‌ను మార్చగలదని చెప్పారు. అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది, దీంతో రెండు జట్లకు భారీ స్కోర్లు సాధ్యం. చివరిదిగా, యోగ్ రాజ్ తన మనసు ప్రకారం ఈసారి పంజాబ్ గెలుస్తుందని పేర్కొన్నారు. ఐపీఎల్ 2025 ఫైనల్ సందర్భంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మరియు పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య తలపోరుకు ముందు, టీమిండియా మాజీ ఆటగాడు యోగ్‌రాజ్ సింగ్ మరోసారి తన ధైర్యమైన వ్యాఖ్యలతో వార్తల్లోకి వచ్చాడు. ాాచీ× తో మాట్లాడిన ఆయన మాట్లాడుతూ, "విరాట్ కోహ్లీ పవర్‌ప్లేలో ఔటయ్యే స్థితిలో లేనిదే అయితే, అతను 250 లేదా 300 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేస్ చేయగలడు," అని అన్నారు. "పంజాబ్‌కు టైటిల్ గెలవాలంటే విరాట్ వికెట్ అత్యంత కీలకం. మొదటి 10 ఓవర్లలో విరాట్ ఔటవ్వకపోతే, ఆ మ్యాచ్ ఇప్పటికే ముగిసినట్టే. కానీ నా అనుభవం చెబుతోంది.. పంజాబ్ గెలుస్తుంది," అని యోగ్‌రాజ్ జోస్యం చెప్పారు. విరాట్ కోహ్లీ ఫామ్: ఈ సీజన్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా రాణిస్తున్నాడు. 614 పరుగులు చేశాడు. సగటు: 55.82, స్ట్రైక్ రేట్: 146.53 గా ఉంది. =జదీ జట్టును 2016 తర్వాత మొదటిసారిగా ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే, ఫైనల్ మ్యాచ్‌ల్లో విరాట్ గణాంకాలు ఆశాజనకంగా లేవు. గత మూడు ఫైనల్లలో స్కోర్లు: 7, 35, 54. గా ఉంది. పంజాబ్ గెలుస్తుందని నమ్మకం: యోగ్‌రాజ్ సింగ్ పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ను కూడా ప్రశంసించారు. "అతను ఒక అద్భుతమైన ఆటగాడు. మ్యాచ్ ఫలితాన్ని ఒక్కతనే మార్చగలడు. విరాట్ =జదీకు అద్భుత ఆటగాడైతే, శ్రేయాస్ పంజాబ్‌కు ఆయుధం. అతనికి 39 సిక్సర్లు ఉన్నాయి ఈ సీజన్‌లో. లీగ్‌లో రెండవ అత్యధిక సంఖ్య," అని అన్నారు.

## హార్ధిక్ పాండ్యాకు భారీ జరిమానా విధించిన బిసిసిఐ




మనగళం : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో ముంబై ఇండియన్స్ జట్టును విజయవంతంగా ముందు నడిపించాడు హార్ధిక్ పాండ్యా. ఆరంభంలో ఓటములతో సతమతమైన జట్టుని తిరిగి విజయాల బాటలో నడిపించాడు. టాప్ ఫోర్‌లో జట్టును నిలిపి.. క్వాలిఫయర్-2 వరకూ రప్పించాడు. కానీ, క్వాలిఫయర్‌లో జట్టు ఓటమిపాలు కావడంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. అయితే ఈ ఓటమి బాధలో ఉన్న హార్ధిక్‌కు బిసిసిఐ మరో షాక్‌ను ఇచ్చింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన క్వాలిఫయర్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు మెయింటేన్ చేసిన కారణంగా అతనికి భారీ జరిమానా విధించింది. ఈ సీజన్‌లో ఇది మూడోసారి కావడంతో హార్ధిక్‌కు రూ.30 లక్షలు జరిమానా విధించింది. దీంతో పాటు జట్టులోని అందరి ఆటగాళ్లకీ.. మ్యాచ్ ఫీజులో 50 శాతం లేదా రూ.12 లక్షలు జరిమానా పడింది. అయితే ఈ సీజన్‌లో రూల్స్ మారడంతో హార్ధిక్ సస్పెన్షన్ నుంచి తప్పించుకున్నాడు. అంతకు ముందైతే.. మూడుసార్లు స్లో ఓవర్ రేటు మెయింటేన్ చేస్తే.. ఒక మ్యాచ్ సస్పెన్షన్ విధించేవారు. కాగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్య ఛేధనకు దిగిన పంజాబ్ 19 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(87) వీరోచిత ఇన్నింగ్స్‌తో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి.. ఫైనల్స్‌కు చేరింది. ఫైనల్స్‌తో పంజాబ్, ఆర్‌సిబితో తలపడనుంది.

## వన్డేలకు మాక్స్‌వెల్ గుడ్‌బై




మనగళం : అంతర్జాతీయ క్రికెట్‌లో రిటైర్మెంట్ల పరంపర కొనసాగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ క్రికెట్(టి20, టెస్టులు)కు వీడ్కోలు పలికారు. ఆ తర్వాత శ్రీలంకకు చెందిన ఏంజెలో మాథ్యూస్ కూడా టెస్ట్ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. తాజాగా ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇదేబాటలో దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సైతం క్రికెట్ వీడ్కోలు పలికాడు. 36 ఏళ్ల గ్లెన్ మ్యాక్స్‌వెల్ 2012లో ఆస్ట్రేలియా తరఫున వన్డేల్లో అరంగేట్రం చేశాడు. 2015, 2013 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడుడు. అయితే ప్రస్తుతానికి మ్యాక్సీ టి20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. ప్రపంచ కప్‌లో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన గ్లెన్ 2023 ప్రపంచ కప్లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో వన్డే చరిత్రలోనే గ్లెన్ అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. ముంబైలోని వాంఖడేస్టేడియంలో ఈ మ్యాచ్‌లో ఆఫ్ఘన్ జట్టు 292 పరుగుల లక్ష్యా న్ని నిర్దేశించింది. లక్ష ఛేదనకు దిగిన ఆసీస్ జట్టులోని 7 మంది బ్యాటర్లు 91 పరుగులకే ఔటయ్యారు. ఇక్కడి నుంచి ఆసీస్ ఓటమి ఖాయం అనిపించింది కానీ, మ్యాక్సీ తుఫాన్ బ్యాటింగ్‌తో గెలిపించాడు. మ్యాక్సీ.. 128 బంతుల్లో 201 పరుగులతో అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేల్లో 13 ఏళ్ల పాటు కొనసాగాడు. 149 మ్యాచ్‌లు ఆడాడు. ఈ సమయంలో 33.81 సగటు, 126.70 స్ట్రైక్ రేట్‌తో 3,390 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 23 అర్ధ సెంచరీలు ఉన్నాయి. బౌలింగ్లో 77 వికెట్లు పడగొట్టాడు. భారత్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ మ్యాక్‌వెల్ చివరిగా వన్డే మ్యాచ్ ఆడాడు.

## ఐదు వేదికల్లో మహిళల ప్రపంచకప్



మనగళం : ఐసీసీ 2025 మహిలల వన్డే వరల్డ్‌కప్ వేదికలు ఎట్టకేలకు ఖరారు అయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు జరుగనున్న ప్రపంచకప్‌కు బెంగళూర్, గువహటి, విశాఖపట్నం, ఇండోర్ సహా శ్రీలంకలోని కొలంబో ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఐసీసీ వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. బీసీసీఐ, పీసీబీ ఒప్పందం ప్రకారం హైబ్రిడ్ మోడల్‌లో పాకిస్థాన్ జట్టు మ్యాచులను పూర్తిగా కొలంబోలో షెడ్యూల్ చేశారు. నవంబర్ 2న ఫైనల్ మ్యాచ్‌ను బెంగళూర్‌లోని చిన్నస్వామి స్టేడియంలో షెడ్యూల్ చేయగా.. ఒకవేళ పాకిస్థాన్ ఫైనల్‌కు చేరుకుంటే టైటిల్ పోరు కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరుగుతుంది. పూర్తి షెడ్యూల్ విడుదల చేయకపోయినా.. ఆరంభ, ముగింపు తేదిలు సహా వేదికలను ఖరారు చేశారు. 2025 ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య భారత్ సహా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లు టైటిల్ వేటలో నిలువనున్నాయి. సెప్టెంబర్ 30న బెంగళూర్‌లో ఆరంభ మ్యాచ్ జరుగనుండగా.. ఆతిథ్య భారత్ తొలి మ్యాచ్‌లో ఆడనుంది. అక్టోబర్ 29న తొలి సెమీఫైనల్‌కు గువహటి లేదా కొలంబో.. అక్టోబర్ 30న రెండో సెమీఫైనల్‌కు బెంగళూర్ వేదికగా నిలువనున్నాయి. విశాఖపట్నం టోర్నమెంట్ తొలి మ్యాచ్‌కు వేదికగా నిలుస్తుందని భావించినా.. గ్రూప్ దశ మ్యాచులకు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ ఇంగ్లాండ్‌లో జరుగనుండగా.. జూన్ 12-జులై 5 వరకు టోర్నమెంట్ షెడ్యూల్ చేశారు. జులై 5న ఫైనల్‌కు లార్డ్స్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. టీ20 ప్రపంచకప్‌లో 12 జట్లు పోటీపడనుండగా..24 రోజుల్లో 33 మ్యాచులు ఏడు వేదికల్లో జరుగుతాయి. ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, భారత్, పాకిస్థాన్, శ్రీలంక, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సహా డిఫెండింగ్ చాంపియన్ న్యూజిలాండ్ 2026 టీ20 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించాయి. ఇతర నాలుగు జట్లను వచ్చే ఏడాది అర్హత టోర్నమెంట్‌లో తేల్చనున్నారు.

## క్వార్టర్స్‌కు జకోవిచ్, జ్వెరేవ్



మనగళం : ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి మాజీ నంబర్‌వన్ ఆటగాడు నొవాక్ జకోవిచ్, 3వ సీడ్ జ్వెరేవ్ ప్రవేశించారు. సోమవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-2, 6-3, 6-2తో అన్‌సీడెడ్ నొర్రీ(బ్రిటన్)ను చిత్తుచేయగా.. జర్మనీకి చెందిన జ్వెరేవ్ 6-4, 3-0తో ఆధిక్యతలో ఉండగా.. గ్రీక్‌స్పూర్(నెదర్లాండ్స్) గాయం కారణంగా మ్యాచ్‌నుంచి వైదొలిగాడు. ఇతర పోటీల్లో 8వ సీడ్ మసెట్టి(ఇటలీ) 7-5, 3-6, 6-3, 6-2తో 10వ సీడ్ రూనే(డెన్మార్క్), 15వ సీడ్ టఫీ(అమెరికా) 6-3, 6-4, 7-6(7-4)తో జర్మనీకి చెందిన అల్ట్‌మైర్‌ను చిత్తుచేశాడు. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి 7వ సీడ్ కీస్(అమెరికా), అన్‌సీడెడ్ బోరుసన్(ఫ్రాన్స్) ప్రవేశించారు. ప్రి క్వార్టర్స్‌లో కీస్ 6-3, 7-5తో సహచర క్రీడాకారిణి బాప్టిస్టేను చిత్తుచేయగా.. బోరుసన్ 3-6, 6-4, 6-4లో అమెరికాకు చెందిన 3వ సీడ్ పెగూలాపై సంచలనం విజయం నమోదు చేసుకొంది. ఇక 2వ సీడ్ కోకా గాఫ్(అమెరికా) 6-0, 7-5తో రష్యాకు చెందిన అలెగ్జాంద్రోవాను చిత్తుచేయగా.. 6వ సీడ్ రష్యాకు చెందిన ఆంద్రీవా 6-3, 7-5తో ఆస్ట్రేలియాకు చెందిన కసట్కినాను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది. పురుషుల డబుల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. మూడోరౌండ్‌కు చేరిన యుకీ బాంబ్రీ, రోహన్ బొప్పన జంటలు పరాజయాన్ని చవిచూశాయి. యుకీ బాంబ్రీ-గల్లోవే(అమెరికా) జంట 4-6, 4-6తో 9వ సీడ్ అమెరికా జంట చేతిలో ఓటమిపాలవ్వగా.. రోహన్ బొప్పన్న-పవిసెవిక్(చెక్) జంట 2-6, 6-7(5-7)తో 2వ సీడ్ బ్రిటన్-చెక్ జంట చేతిలో ఓటమిపాలయ్యాయి


Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310